
# వారసుడు



-టి. రాజేశ్వరి

రైలు ముందుకు దూసుకుపోతుంటే నాకు చెప్పరాని దిగులు వేస్తున్నది. కంపార్ట్‌మెంట్‌లో వాళ్ళంతా ఏవేవో మాట్లాడుకొంటూ సంతోషంగా వున్నారు నేను తప్ప. నాన్నగార్కి చెప్పకుండా యిలా రావడం పొరబాటని అంతరాత్మ నిలదీస్తోంది. తప్పేమీ లేదని మళ్ళీనేనే దాన్ని జోకొడుతున్నాను. నన్ను చూసి తమ్ముడు, చిన్నాన్న ఎలా భావిస్తారో.... అసలు గుర్తుపడతారా? చిన్నాన్న గుర్తురాగానే మనసు వికలమైపోయింది. నా మనసు ఆ జ్ఞాపకాల్లోకి జారిపోయింది.

మావూరు ఎంతోబావుంటుంది. స్వంత ఊరు తలుచుకుంటే మనసు పులకరిస్తుంది. అందులోనూ బాల్యం ఎంతతీయనిది. నాన్నగారు ఉపాధ్యాయుడుగా వుండేవారు. పొలం, లంకంతయిల్లు, నాన్నగారు, చిన్నాన్న అత్తయ్యలు ఒహ్, సందడి. తాతగారెప్పుడూ ఏదో అనా రోగ్యంతో బాధపడుతుండేవారట. అంచేత పెద్దకొడుకైన నాన్నగారే అజమాయిషీ చేసేవారు. చిన్నాన్న చదువు కోకుండా చెడుస్నేహాలు చేసి తాతగార్కి చాలా మనస్తాపం కల్గించాడట. తాతగారు తన అనారోగ్యం దృష్ట్యా పొలం నాన్నగారి పేరు మీద విల్లు రాసారట. నాన్నగారు అత్తల పెళ్ళిళ్ళు పేరంటాలు అన్నీసక్రమంగా జరిపించారు. నాన్నగారి వివాహమయిన రెండేళ్ళకే తాతగారు, నాయనమ్మ చనిపోయారు. చిన్నాన్న తిరుగుళ్ళు మరీ ఎక్కువయ్యాయి. పెళ్ళిచేస్తేకుదురుగా వుంటాడని ఊళ్ళో వాళ్ళ సలహా. కాని చదువు, మంచి నడవడిలేని చిన్నాన్నకి పిల్ల నివ్వడానికి కొద్దిగా జంకి సంబంధాలు వచ్చేవి కావు. ఆఖరికి పొరుగూరులో అమ్మాయిని ఖాయంచేసారు. అమ్మ, నాన్నగారు అంతా తాంబూలాలు పుచ్చుకోవడానికి వెళ్తే....చిన్నాన్న సంగతి తెలిసిందో, మరేకారణమో ఐదెకరాలు అబ్బాయి పేర్న వ్రాస్తే పిల్లనిస్తామన్నారు. ఎవరెంత చెప్పినా వినలేదట. అంతమందిలో నాన్నగారాక్షణంలో పొలం ఎవరిపేరుంటేనేం అంటూ చిన్నాన్న పేర్న ఐదెకరాలు రాశారు. పెళ్ళి జరిగిపోయింది.

కాలం పరుగులు తీసింది, కాలప్రవాహంలో ఎన్నో మార్పులు. పిన్ని చాలా మార్చింది చిన్నాన్నను. ఇంటిపట్టునుండి పొలం వ్యవహారాలు అవీ చూడటం మొదలు పెట్టాడు. నాన్నగారి సంతోషానికి మేరలేదు, చిన్నాన్నకుదురుగా వుంటున్నందుకు. అప్పుడే, ఇద్దరక్కల తర్వాత నేను పుట్టాను. నాకు సంవత్సరం నిండుతుండగా చిన్నాన్నకు కొడుకుపుట్టాడు. మేమిద్దరం రామలక్ష్మణుల్లా వుండాలని, నాన్నగారు నాపేరు రామం అని తమ్ముడిపేరు లక్ష్మణ్ అనిపెట్టారు. ఎందుకోగాని లక్ష్మణ్ అంటే నాన్నగార్కి చాలాప్రేమ. వాడూ నాన్నగారి దగ్గర చేరిక. మేమిద్దరం జంటగా తిరిగేవాళ్ళం. నేనే పనిచెప్పినా లక్ష్మణ్ చిటికలోచేసేవాడు. నాన్నగారితో కూడా వెళ్లే వాడెక్కడికైనా. నేనుశ్రద్ధగా చదువు కొంటుంటె తను ఊళ్ళో వింతలు విశేషాలు చెబుతుండేవాడు. ఏపనికైనా ముందుండేవాడు. నాన్నగారి తర్వాత వాడే ఊరిపేరు నిలుపుతాడనేవారు. నాన్నగారు వాణ్ణి పేరుతో పిలిస్తే కోప్పడేవారు. 'తమ్ముడూ' అనాలి, అప్పుడే ఆత్మీయత వెల్లి విరుస్తుందనేవారు. పరీక్షల ముందు నాన్నగారు దగ్గర కూర్చోబెట్టి చదివిస్తే చదివి ప్యాసౌతుండేవాడు. మా వూళ్ళోకి అప్పుడే వచ్చింది సినిమా హాలు. సినిమాకెళ్ళాలంటె యింటిల్లపాదీ చేసే హడావుడి అంతాయింతాకాదు. ముందునాన్నగారి పర్మిషన్ లభించాలి. దానికి లక్ష్మణ్‌ని శరణుజొచ్చేవాళ్ళం. నాన్నగారి నెలా ఒప్పించేవాడో తెలియదుగాని పర్మిషన్ లభించేది. మా యిద్దరికీ నచ్చిన సినిమా 'జయసింహ'. అది నాల్గుసార్లు చూసాం. అందులో హీరోనటనగాని, మధురమైనపాటలు గాని కాదు మాకునచ్చింది. ఆ అన్నదమ్ముల అనుబంధంనచ్చింది. వాళ్ళలాగా వుండాలని, ఎప్పటికీవిడిపోగూడదని, శపథంచేసుకొన్నాము.

నాకు, లక్ష్మణ్‌కి చెల్లెళ్ళు పుట్టారు ఆడపిల్లపుట్టిం తర్వాత పిన్ని చిన్నాన్న ప్రవర్తనలో మార్పు రాసాగింది. నాన్నగారు చాలా వుదార స్వభావులు. వున్నంతలో అందర్నీ ఆదరిస్తుండేవారు. ఆ సంవత్సరం పొలాలు బాగాపండాయి. పాలేళ్లు క్రొత్త బట్టలు అడిగారు. నాన్నగారందర్కీ బట్టలు తెచ్చారు. ఉగాది రోజు మేమంతా క్రొత్తబట్టలేసుకొని మురిసిపోయాం. మాతోపాటు పాలేళ్ళుకూడా. ఈ విషయం పట్టనట్లు చిన్నాన్న అరుగుమీదెవరితోనో రాజకీయాలు మాట్లాడుతున్నాడు. పిన్ని ఎవరితోనో అంటోంది "అత్తసొమ్ము అల్లుడు దానమిచ్చాట్ట" అని. నేను, నాన్నగారులోపలికి రాబోతున్నాము. నాన్నగార్ని చూచి పిన్ని లోపలికి వెళ్ళిపోయింది. నాన్నగారెందుకో గంభీరంగా మారిపోయారు. పరిస్థితి తేలిగ్గానే గ్రహించారు. ఫలితం మేము చాలా దూరంగా వెళ్ళిపోయాం. మేము వెళ్ళిపోతుంటే వూరంతా కదలివచ్చింది. లక్ష్మణ్ మాతో వస్తానని పేచీ పెట్టాడు. నాన్నగారెంతోనచ్చచెబితే ఊరుకున్నాడు. సజలనయనాలతో మమ్మల్ని రైలెక్కించి దూరంగా వెళ్ళేవరకు చూస్తూనుంచున్న లక్ష్మణ్ కళ్ళముందు కదిలాడు.

రైలు కుదుపుతో ఆగింది. అరె మావూరే! బ్యాగ్ తీసుకొని దిగా. స్టేషనులో పెద్దమార్పేమీలేదు. ఎక్కువమంది దిగలేదు. కొందరునన్ను పరీక్షగా చూడటం గమనించాను. పున్నాగచెట్టు అలాగే వుంది ఒకమూల ఒంటరిగా. నన్ను గుర్తుపట్టినట్లు జలజలారాలాయి గాలికి. ఆపూలంటె నాకు ప్రాణం. ఆపూలకోసం రోజు లక్ష్మణ్, నేను యిక్కడిదాకా వచ్చి పూవు లేరేవాళ్ళం. దండలల్లి వేణుగోపాలస్వామి ఆలయానికి తీస్కెళ్ళేవాళ్ళం. నేనీ ఆలోచనల నుండి బయటపడితేగాని లాభంలేదు. తల విదిలించి రిక్షాకోసం చూసా. నన్ను చూసి.

"రండి బాబూ ఎక్కడికెళ్ళాలి?"

"పరమేశంగారింటికి"

"ఎం.ఎల్.ఏ గోరింటికా ఎక్కండెక్కండి". వాడు రిక్షా నాముందు నిలిపాడు.

"వారికేటిగావాల" అన్నాడు.

"ఏమైతేనీ కెందుకు? చెబితేగాని ఎక్కనివ్వవా? అనుకొంటూ పైకి "అన్నకొడుకుని" అన్నా.

"లచ్చిమయ్యే అన్నవని క్షణంలో పోల్చేశా...." అంటూ రిక్షారయ్యిన పోనిస్తున్నాడు.

నాకు యిల్లు దగ్గరౌతుంటే మనసు ముడుచుకుపోతోంది. మేము వెళ్ళిపోయిన తర్వాత చిన్నాన్న రాజకీయాల్లోకి వెళ్ళినట్లు, పిన్ని తెలివితేటలతో సంసారం నడుపుతున్నట్లువిన్నా. అంచెలంచలుగా ఎం.ఎల్.ఏ. అయ్యాడు. చిన్నప్పుడంతతెలియకపోయినా తర్వాత తెల్సింది. చిన్నాన్నకునాన్నగారు రాసిన పొలం ఒక్కటే మిగిలిందనీ, మిగతాది అప్పులు తీర్చడానికి అమ్మివేసారని. అప్పులవీ ఉమ్మడి కుటుంబమప్పటివేగదా పిన్ని అంతమాటెందుకన్నదో. నాన్నగారు మేము వున్న వూరోదిలి క్రొత్తచోట ఎన్నో యిబ్బందులు పడ్డారు. కాని నాన్నగారెప్పుడూ అనలేదు కష్టమని. అమ్మకూడా



అనుకోలేదు. మావూరునుండి చిన్నాన్న వాళ్ళే తరిమేసినట్లు, మా ఆస్తి తీసుకొని పిన్ని మమ్మల్ని చులకనచేసినట్లు నాకు ఏదో తెలియనికసి. ఇందులో లక్ష్మణ్ తప్పులేకున్నా వాడన్నా మనసులో తేలికభావం.

"దిగండి, బాబూ" రిక్షావాడికేకతో చుట్టూచూశా. క్రొత్త యిల్లు, తోటలో రకరకాల పూలుస్వాగతం పల్కుతున్నాయి. ఇంకోప్పుడైతే చాలా ఆనందించేవాణ్ణి. రిక్షావాడు లోపలికెళ్ళి చెప్పినట్లున్నాడు. "అన్నయ్యా!" మరుక్షణం లక్ష్మణ్‌ని గాఢంగా హత్తున్నా. ఏదో తెలియని హాయి మనసంతా నిండింది. "రిక్షా డబ్బులు" అంటూ వెనక్కి తిరిగా. "ఎన్నాళ్ళకొచ్చారు? అక్కావాళ్ళంతా బాగున్నారా?" రిక్షాడబ్బు లిచ్చి, నాకు నమస్కారంచేస్తూ తెలియనివారి యోగక్షేమాలడుగుతున్న మరదలు. ఏదో సాకుతో లక్ష్మణ్ పెళ్ళికి కూడా వెళ్ళలేదు.

"నరేన్, వైజయంతిబాగున్నారా?"— లక్ష్మణ్ నవ్వుతూ.

"అరె! మాపిల్లలపేర్లు కూడావీడికెలా తెలును? మా విషయాలన్నీ తెలుసుకొంటున్నాడన్నమాట.

"పెదనాన్నగారు" పిల్లలకు పరిచయంచేసాడు. "నమస్తే" యిద్దరూ చేతులు జోడించారు ముద్దుగా. పిల్లలకేమితేలేదు. అసలు వాడికిద్దరు పిల్లలని తెలిస్తే గదా!

"రండి" అప్యాయంగా పిలిచా. పేర్లడుగుదామని మళ్ళీ విరమించుకొన్నా. పిన్ని చిన్నాన్నవచ్చారు.

"ఏంబ్రోయ్, దారితప్పివచ్చినట్లుంది." ఆయనతీరే అంత.

"ఇప్పటికి గుర్తొచ్చామన్నమాట" పిన్ని వలకరింపో, దులపరింపో. నేను మౌనంగా చేతులుజోడించా.

"అన్నయ్యా! మేడమీదకెళ్లాం." తమ్ముడు రక్షించాడా సన్నివేశం నుంచి. పైనకూడా పెద్దదే. అన్ని హంగులూ వున్నాయి. ఎందుకుండవు? ఎం.ఎల్.ఎగారి యిల్లాయె. బాత్‌రూమ్ చూపించి లక్ష్మణ్ క్రిందకెళ్ళాడు. నేను బాత్‌రూమ్‌లోదూరా వెచ్చగానీళ్ళుమీదపడుతుంటె మళ్ళీ ఆలోచనలు. నేనొచ్చినవని ఎలా చెప్పాలి. ఏ ఆవేశంలో వచ్చానో గాని చాలా బిడియంగావుంది. నాన్నగారు ఊళ్ళోలేరు. సేవాకార్యక్రమాల్లో ఎక్కడెక్కడికో వెళ్ళిరావడం వారికి మామూలే! నాన్నగారు రిటైరవకముందే మా పెళ్ళిళ్ళయ్యాయి. కట్నకానుకల ప్రసక్తిలేకుండానే చేసారు. కాని చెల్లి పెళ్లిలా జరిగేలాలేదు. వేగంగా మారేకాలం, డబ్బుతోనే కొలుస్తున్న సంబంధబాధవ్యాలుగా మారింది. చెల్లిపెళ్ళి కుదిరినట్లే ననుకొన్నాం. కాని వాళ్ళు మళ్ళీ కబురుచేసారు. కట్నంలేకున్నా లాంఛనాలలోపం వుండకూడదని, పెళ్ళి ఘనంగా చేయాలని. నాన్నగారు లేరు. వుంటే సంబంధంకాన్సిల్ చేయించే వారే ఆకబురువింటే. అమ్మ పరిస్థితులకు తలవంచింది. నేను ఎలాగైనా లక్ష్మణ్ దగ్గర డబ్బు తెస్తానని, అప్పుగానే తీసుకుంటానని బైలుదేరివచ్చా. నాన్నగారికీ విషయం తెలిస్తే మళ్ళీ నాముఖంచూడరు. నాన్నగారు గుర్తురాగానే గబగబా స్నానంకానిచ్చి బైటవడ్డా. ఎదురుగా బల్లమీద సాసరుబోర్లించి పెట్టివున్న కాఫీ. నా అలవాట్లుకూడా గుర్తున్నాయి. కాఫీతాగితే ప్రాణంలేచొచ్చింది. క్రిందికిదిగి, చిన్నాన్న ఎవరితోనోమాట్లాడుతుంటే కూర్చున్నా వింటూ.

పిన్నికూడా వచ్చి కూర్చుంది. నాతో ఏవో చెప్పసాగింది. వాళ్ళసలీ పల్లెలో వుండలేకపోతున్నారట. హైద్రాబాద్‌లో వుంటారట. లక్ష్మణ్‌ని రమ్మంటే రాడట. అందుకే యింతయిల్లు ఇక్కడే కట్టిచ్చారట. ఈ పల్లెలో వాడు చేయవలసిన రాచకార్యాలేమిటో అర్థమవడంలేదంది. ఎక్కడలేని డబ్బు వాడి ఖర్చుకేచాలదట. ఈబడిపంతులు ఉద్యోగం వాడికెందుకు? అంది. నేను ఎవరి పెళ్ళిళ్ళకీ రాలేదని నిందవేసింది.

'భోజనాలకి రండి పెదనాన్నగారూ' పాప ముద్దుగా పిలుస్తూంది.

"రక్షించావుతల్లీ!" అనుకొని మనస్సులో, పాప చేయి పట్టుకొని లోపలికివెళ్ళా.

భోజనంలో అన్నీ నాకిష్టమైన వంటలే. అమృతంలా వుంది వంట. 'అన్నయ్యకదిష్టం, ఇదిష్టం వడ్డించు వందనా' అంటూ భార్యకు పురమాయించాడు. నాకు నవ్వు వచ్చింది వాడిధోరణికి. తృప్తిగా తిన్నాను. లేచి చేయికడుక్కొచ్చేసరికి నాప్‌కిన్ అందించాడుబాబు. వక్కపొడితోపాప. వక్కపొడితీసుకొని నోట్లోవేసుకొన్నా. నాకుపాపనిచూస్తుంటే అమ్మ గుర్తొచ్చింది. మా చిన్నప్పుడెవరన్నా అతిథులొస్తే మమ్మల్ని టవలుపుచ్చుకొని నుంచోమని, చేతులమీద నీళ్ళుపొయ్యమని పురమాయించేది. యిప్పటికీ నాన్న గార్కి అలానే చేస్తుంది. నేను తప్పించుకొన్నా లక్ష్మణ్, అమ్మచెప్పిన పని తు.చ తప్పకుండా చేసేవాడు. చిన్నప్పటి మాయిల్లులా వుంది మళ్ళీ. తన పద్ధతులు అవీ ఏవీమార్చుకోలేదువీడు.

" విశ్రాంతి తీసుకో అన్నయ్యా. తర్వాత అలా వెళ్ళొద్దాం"

"చిన్నింటికా" మరదలు అంటుంటే వాడు నవ్వాడు. కాసేపు పేపరుచదివి అలాగే కొంచెం నిద్రపోయిలేచా. లక్ష్మణ్ చిన్నాన్నతో చెప్పి వచ్చాడు.

మేమిద్దరం స్కూటరుమీద పోతుంటే ఊళ్ళో చాలామంది వాడికి నమస్కారాలుచేయడం గమనించాను. కొంతమందిని ఆపి నన్ను పరిచయంచేసాడు. ఇదంతా చూస్తుంటే వీడికిక్కడ మంచిపేరున్నట్లుంది. నాన్నగారిలా వీడూ సంఘసేవకుడు కాబోలు. దాదాపు ఓ గంట

**'వారసుడు' అనగానే పొలం, యిల్లు అనే ఆస్తికి మాత్రమే కానవసరంలేదు. గ్రామాభ్యుదయానికి యధాశక్తి పాటుపడటంలోనూ - వారసుడు కావచ్చును. అది గ్రహించిన అన్నగారి అజ్ఞానం కరిగిపోయింది.**

ప్రయాణం తర్వాత మరీ యిరుకుబాట, నిర్జనమైన బాట వెంటపోసాగాము. వీడెక్కడికి తీస్కెళ్తున్నాడు? కొంపదీసి మదిరా మగువావుండవుగదా! మేమలావెళ్తొస్తా మంటే చిన్నింటికా అని మరదలు అనడం గుర్తొచ్చింది. వీడికెక్కడి లేని డబ్బు చాలడంలేదని పిన్ని చెప్పిందిగా! యిదాకథ అనుకొన్నా. వాడికి చెడ్డలవాట్లున్నాయంటే మనసు శాంతించిందెందుకు? మనిషిలో పశుత్వం దాగివుంటారందుకే. నన్ను నేను తిట్టుకొన్నాను.

"మీబస్తీ వాళ్ళంతా ఆలోచన్లే భోజనంచేస్తారా ఏమిటి? ఈ పరిసరాలు, ప్రకృతి, కొండలు నీకేమి ఆహ్లాదంగా లేవా?" లక్ష్మణ్ అడుగుతున్నాడు.

అప్పుడు చూసా, మేము మామిడి, నిమ్మ, జామ తోటల గుండా పోతున్నామని. మనసుకోతిలాంటిదన్నారు. మంచిగాచూస్తే మంచిగా, చెడ్డగాచూస్తే చెడ్డగానే కన్పిస్తుంది.

"అదేంలేదు ఏదో క్రొత్తగదా!"

"నీకు క్రొత్తగా అన్పిస్తుందేమోగాని నాకింకా మనమంతా కలిసివున్నట్లే వుంటుంది." గాఢంగా నిట్టూర్చాడు.

నేను కదిలిపోయా. స్నేహంగావాడి భుజంతట్టా. బాట కిరువైపులా కొబ్బరిచెట్లు పైన పెద్ద బోర్డు. "జయసింహ స్నేహాలయం." అని

"నీవు చిన్నప్పటి సంగతులు మర్చిపోలేదు గదూ!"

"ఏంప్రశ్న? మధురమైన బాల్యాన్ని ఎవరు మర్చిపోగలరు. మనం ఆడినఆటలు బాసలు అన్నీ సజీవాలు నామనసులో....."

"ఈ స్నేహాలయమేమిటి?" కుతూహలంగా అడిగా.

"రా చూద్దువు. స్కూటరొకప్రక్కగా పెడుతూ అన్నాడు. అప్పటికే మేమొచ్చినట్లు తెలిసినట్లుంది. కొంతమంది పిల్లలు, వృద్ధులూ బయటికొచ్చారు. అందర్కీ నన్ను అన్నయ్యగా పరిచయంచేశాడు. లోపలంతా తిప్పిచూపించాడు. పనిపాటుచేసుకోలేని వృద్ధులు, ఎవరూలేని పిల్లలకు అదో దేవాలయం. జీవితంలో దగాపడిన స్త్రీలుకూడా వున్నారక్కడ. వాళ్ళే తోటలు అవీ చూస్తారట. పిల్లల్ని పోషించడం, వృద్ధులకు అండా వాళ్ళే. డిస్పెన్సరీ కూడా వుందక్కడ. డాక్టరు ప్రక్కవూరినుండి వచ్చి ఓగంట చూచివెళ్తాడట. పిల్లలు పెద్దయితే స్కూలుకి వేరేచోటకు పంపిస్తారట. హాస్టలు అవీ ఉన్నచోటుదగ్గర.

"డాక్టరుగార్ని పరిచయం చేస్తా" అంటూలోపలికి తీస్కెళ్ళాడు.

"నీలాగే ఆదర్శవాది....." అంటూ పరిచయం చేస్తుంటే.... మాటల్లో తప్ప చేతల్లో చూపించలేని నేను తలదించుకొన్నాను. తనకీ ఆశయాలున్నాయి కాని అన్నీ చేయలేమని లక్ష్మణ్ వల్ల ఈపాటిచేయగల్గుతున్నా..." నన్నాడు డాక్టరు.

"మీరు పేషంట్లని చూడండి" అంటూ బయటికి వచ్చాం.

"నాగదికి పోదాం....వంటతనుకాఫీ బాగా కలుపుతాడు....."

దూరంగావున్న చిన్న కుటీరంలాంటి యిల్లు చూస్తుంటే పంచవటిలో రాముని సేవచేస్తున్న లక్ష్మణుడు గుర్తొచ్చాడు. మనవసేవే మాధవసేవ. మౌనంగా తననను సరించా. తలుపుతీయగానే నాన్న, అమ్మల పెద్ద ఫోటోలు, గదినిండా పుస్తకాల బీరువాలు. నామనసు అర్థమైంది.

"తమ్ముడూ, వీట్లన్నిటికీ డబ్బెలావస్తోంది. యివన్నీ ఎలాచేస్తున్నావు?" ఈసారి ఆశ్చర్యాన్నణుచుకోలేదు. మనఃస్ఫూర్తిగా అడిగా.

"చిన్నాన్న దగ్గరే రాబడుతున్నా", తనూ మాతోపాటు నాన్నగార్ని నాన్నగారిని నాన్నగారని, చిన్నాన్నను చిన్నాన్నని పిలవడమే అలవాటు.

"తెలిస్తే యిస్తారనుకొన్నావా, ఏదో అవసరానికడుగుతుంటా, యింకా వందన పొలాల మీద ఆదాయం, స్నేహితుల సహాయం వున్నాయిలే! ఏదో చేయాలని ఈ జన్మకి. చిన్నాన్న, పిన్ని నేను పాడుచేస్తున్నానను కొంటారు. దేనికైనా డబ్బులేందే ఏమీచేయలేముగదా! ఇక్కడే ఎక్కువగా వుంటుంటా.... యిదే నా చిన్నయిల్లు" లక్ష్మణ్ పెద్దగానవ్వాడు. నేనునవ్వేశా."ఇందాక చూచిన డాక్టరెలావున్నాడు? మనచెల్లాయికి ఈడు, జోడుకదూ, నాకాఫామిలీ అంతాతెలుసు. ఒకసారి మనింటికి వస్తాడు. అమ్మ, నాన్నగారు, చెల్లాయిచూస్తారు. నాన్నగారి ఆదర్శాలకు తగినవాడు. కట్నకానుకల ప్రసక్తిలేదు. నాన్నగారి కోరికా నెరవేరుతుంది. వారి అభిప్రాయాలు మంచివి కొన్ని మనం ఆచరణలోపెట్టవద్దూ. ఏం?"

నేనేమనగలను? నీవాత్సల్యానికి నేను తగనననా? చిన్నవాడివైనా నన్ను క్షమించమననా? ఇంతలో కాఫీ వచ్చింది. నిజంగా కాఫీబాగుంది.

"మనంబయల్దేరదాం" నలుగురినీ పిలిచి ఏవేవను లు పురమాయించాడు. వచ్చేస్తుంటే గుర్తొచ్చింది. బోర్డు దగ్గరికిరాగానే...

"తమ్ముడూ! జయసింహ అనిపేరెందుకు పెట్టావు?"

"నాన్నగారిపేరు నరసింహ సింహ, అమ్మపేరు జయమ్మలో జయ, రెండూ కలిపి జయసింహ, మన అనుబంధమదేకదా! అందుకే ఆపేరు....."

నేను మాపిల్లకి నరేష్ అని, వైజయంతి అనిపెట్టి అమ్మనాన్నగార్లపేర్లు కలిసివచ్చేట్లు పెట్టానంటే నాన్నగారు నవ్వినన నవ్వుగుర్తొచ్చింది. నాన్నగారెప్పుడూ అంటూంటారు 'నావారసుడు లక్ష్మణ్' అని. నేననుకునే వాణ్ణి ఆస్తుల వీవాళ్ళకేగదా దక్కేది. పొలం, యిల్లు అన్నీ వాడికే రాసినట్లు అయిందిగా. వారసుడుమరి! కానీ యిప్పుడు తెలుస్తోంది నేనెంత అజ్ఞానంలో వున్నానో.

"నాన్నగారే నాకీ స్ఫూర్తి నిచ్చారు. వారికిష్టమైనట్లు నడవడం నాకర్తవ్యం." లక్ష్మణ్ గొంతు జీరపోయింది.

"తమ్ముడూ! నిజంగానీవు నాన్నగారి వారసుడివి...." అంటూంటే నాకళ్ళు జలజలా వర్షించాయి. నాలోని కల్మషం కడిగేసినట్లయింది.

రైలు ముందుకు దూసుకుపోతోంది. నామనసు ఆనందతరంగితమైంది. నాన్నగార్కి చెప్పకుండా రావడం మంచిదనే ననిపిస్తున్నది. ఈసారి కంపార్ట్ మెంట్‌లో అందరితోపాటు నేనూ సరదాగా ప్రక్కవాళ్ళతో మాట్లాడగలుగుతున్నాను.

రచయిత్రి చిరునామా:
టి. రాజేశ్వరి
c/o టి. రామమోహనరావు
డి. 5 డాక్టర్స్‌కోలని
మహారాణిపేట
విశాఖపట్టణము - 530 002

## క్రీడారంగం:

# గుంటూరు బాలికల ప్రతిభ



సియోల్‌లో కాంస్యపతకం పొందిన మనూద

దక్షిణ కొరియాలోని సియోల్‌లో జరిగిన 30 వ ప్రపంచ పాఠశాల విద్యార్థుల చిత్రకళా ప్రదర్శనలోని గుంటూరులోని "కేంద్రీయ విద్యాలయ" విద్యార్థులు 27 బహుమతులను గెల్చుకున్నారు. వారిలో మూడవ తరగతి బాలిక కుమారి మనూద కాంస్యపతకాన్ని గెల్చుకున్నది. మిగిలినవారిలో, 18 మందికి "గుడ్‌వర్క్" బహుమతులు, 8, మందికి "సెలక్టెడ్ వర్క్" బహుమతులు లభించాయి.

బహుమతి పొందిన చిత్రాలను సియోల్ ఒలింపిక్ క్రీడల చిత్రకళోత్సవాలలో భాగంగా కొరియన్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో సెప్టెంబరు- 5 నుండి అక్టోబరు 2 వరకూ ప్రదర్శించారు. కొరియన్ చిల్డ్రన్స్ సెంటర్‌లోని ఎగ్జిబిషన్ హాలులో ఈ చిత్రాలను అక్టోబరు 12 నుండి డిసెంబరు 31 వరకూ ప్రదర్శించారు.



సియోల్ జరిగిన 30 వ ప్రపంచ చిత్రకళ ప్రదర్శనలో బహుమతులు గెలుపొందిన కేంద్రీయ విద్యాలయ (గుంటూరు) విద్యార్థులు.

ప్రపంచ చిత్రకళాపోటీలలో గుంటూరులోని కేంద్రీయ విద్యాలయ బాలలు బహుమతులు పొందడం వరుసగా ఇది నాల్గవ సంవత్సరం. గతంలో సోవియట్ యూనియన్, జపాన్, అమెరికా, దక్షిణ కొరియాలలో జరిగిన వివిధ అంతర్జాతీయ పోటీలలోనూ వారు పలు బహుమతులను పొందారు. 1985, 1986, 1987 లలో ఈ విద్యాలయం నుండి అయిదుగురు బహుమతులలో భాగంగా విదేశాలలో పర్యటించారు. ముగ్గురు విద్యార్థులు 'సోవియట్ భూమి' అవార్డులు పొంది సోవియట్ యూని యన్‌లోని అర్టెక్ యంగ్ పయనీర్స్ శిబిరంలో నెల రోజులపాటు వేసవి కాలం గడిపారు. 1986 లో సియోల్‌లో ఒక బాలిక 'గ్రాండ్‌ప్రైజ్' పొంది, తండ్రితో కలిసి ఆదేశం పర్యటించి, పదవ ఆసియా క్రీడోత్సవాలను చూడగలిగింది.

కేంద్రీయ విద్యాలయం బాలలు చిత్రకళలో ఇన్ని బహుమతులు పొందడానికి విద్యాలయ డ్రాయింగ్ టీచర్ శ్రీ.ఆర్. పుట్టాచారి కృషికారణమని విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీ.టి.ఎ. రెడ్డి అంటారు. దేశంలో మరె ఒక విద్యాలయంకూడా ఇన్ని బహుమతులను ఒకే పర్యాయం పొందలేదు అనడం అతిశయోక్తికాదు.

ఈ సంవత్సరం 'సియోల్'లో "గుడ్‌వర్క్" బహుమతులు పొందిన విద్యార్థులు:

సి. శ్రీనివాసులు (మూడో తరగతి), కె.వి. కోటేశ్వరరావు (నాలుగు), టి.వి.ఎస్. రెడ్డి (నాలుగు), ఎం. సుధారాణి (అయిదు), పి.ఉషారేఖ, విజయలక్ష్మి, పి.జి.వి. నరసింహ, ఆర్. ఉషా, పి. పద్మావతి (అందరూ ఏడో తరగతి), జి.వి. నరసింహరావు, బి. శ్రీనివాసరావు, కె. సురేష్ (అందరూ ఎనిమిదో తరగతి), డి. శ్రీనివాస్, టి.రమానంద్, ఎ.బి.సంజయ, ఎం.వి.ఎ. ప్రసాద్, ఎస్.ఎ.మునీర్ అహ్మద్, పి.వి.ఎస్.కాటిన్య (తొమ్మిదో తరగతి)

'సెలక్టెడ్ వర్క్' బహుమతులు పొందిన విద్యా ర్థులు పి.సత్యప్రకాశ్, జె.శ్రీనివాసరావు (6వ తరగతి). తామస్.డి.వెర్క్, కె.సురేష్ (7 వ తరగతి), కె. వినయసాగర్, జి. షెమి (8 వ తరగతి), డి. శ్రీకాంత్, డి. సంజయ్ (9 వ తరగతి).

—రేణుక